# బ్లాంక్ చెక్

శిరీషను చూసేందుకు శివతోపాటు అతడి తల్లి, బంధువులు, మిత్రులు కూడా వచ్చారు.

పెళ్లిచూపులు ముగిశాయి.

అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు నచ్చినట్టు అందరికీ అర్థమైపోయింది.

"అమ్మాయిని ఏమైనా అడుగు బాబూ" అన్నారు ధనుంజయరావుగారు.

"పెళ్లంటే నూరేళ్లపంట. ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవడం ఎంతైనా అవసరం" అతని మాటకు వంతపాడాడు అవధాని.

"అడిగేందుకేమున్నాయి. అమ్మాయి గురించి అన్నీ మీరే చెప్పేశారు. శిరీష నాకు నచ్చింది. సరేనా?" అన్నాడు శివ.

కొడుకు పెళ్లికి ఊ అనడంతో ఊపిరి పీల్చుకుంది ఉమామహేశ్వరి. ఎలాగైనా తనయుడికి తొందరగా పెళ్లయితే చాలని చూస్తోందావిడ.

"కట్నకానుకలు కూడా ఇప్పుడే సెటిల్ చేసేసుకుంటే బావుంటుందేమో! దగ్గర్లోనే భేషైన ముహూర్తాలున్నాయి."

అవధాని మాటలకు చిరునవ్వు నవ్వుతూ "కట్నం ఇంత ఇస్తానని నా నోటితో నేను అనను. ఇదుగో బ్లాంక్ చెక్. నీకెంత కావాలో రాసుకో. సంతకం చేసిస్తాను" అన్నారు ధనుంజయగారు.

శివ చెక్కు మీద ఎంత రాస్తాడా అని అంతా చేష్టలుడిగి చూస్తున్నారు.

పెన్ను తెరచి అటు ఇటు చూశాడు శివ.

"ఫరవాలేదు రాయి బాబూ"

అంకె రాసి కాబోయే మామగారి చేతికిచ్చాడు శివ.

"వన్ రుపీ ఓన్లీ!"



శివను వెర్రి వెంగళప్పను చూసినట్లు చూశారు తోడుగా వచ్చిన మిత్రబృందం.

అబ్బాయి ఔన్నత్యాన్ని చూసి ముగ్ధులయ్యారు బంధుజనం.

కాబోయే అల్లుడికి ధనాశ లేదని తెలుసుకుని ఎంతగానో ఆనందించారు ధనుంజయగారు. తను పెట్టిన పరీక్షలో నెగ్గినందుకు అతడికెంతో సంతోషంగా వుంది. ఇహ పిల్లనివ్వడానికేమాత్రం ఆలోచించనక్కర్లేదని అనుకున్నారు.

"శుభం" అన్నారంతా లేచి.

పెళ్లివారిని గుమ్మం వరకు సాగనంపారు ధనుంజయగారు.

"ఓరి దౌర్భాగ్యుడా! పది లక్షలో పదిహేను లక్షలో రాస్తావనుకున్నాం. అదేవిట్రా అలా చేశావ్?" బయటకొస్తూనే చీవాట్లేశారు మిత్రబృందం.

"శిరీష ధనుంజయగారి ఏకైక పుత్రిక. వెనకా ముందూ అతనికి వారసులెవరూ లేరు. అడిగినా అడగకపోయినా అతని ఆస్తి అంతా నాదే కదరా! అంతలోనే తొందర పడటం దేనికని" అన్నాడు శివ.

అతడి ముందుచూపుకి ఆశ్చర్యపోయి నోళ్లు మూసుకున్నారు అతని మిత్రబృందం.

అయితే ఇంతకుముందే వారిద్దరికీ పరిచయం వుందని, ధనుంజయగారు పెట్టే పరీక్ష శిరీష ద్వారా శివకి ముందుగానే తెలిసిపోయిందన్న నిజం అక్కడున్న వారికెవరికీ తెలీదు.

**-దూరి వెంకటరావు**
(విజయనగరం)

హర్ష.

నోట మాట రాక మౌనంగా వుండిపోయింది కల్పన. నిశ్శబ్దంగా నిష్క్రమించాడు హర్ష. తల ప్రక్కకు తిప్పి చూసేసరికి కల్పన స్నేహితురాలు దీప వుంది.

"అంతా విన్నాను. ఏమిటి నీకీ విషమ పరీక్ష?" అంది దీప.

మౌనమే శరణ్యమైంది కల్పనకు. దీప ద్వారా కాలేజీలోకి కొంతమంది స్టూడెంట్స్‌కి విషయం తెలిసింది. ఆ మరుసటి రోజు ఉదయం మిగిలిన వారందరికీ తెలిసింది. హర్ష కూడా స్వయంగా ఆ విషయం నిజమేనని చెప్పడంతో విషయం అందరికీ విదితమైంది. హర్ష కాలేజీకి వచ్చాడు కానీ కల్పన రాలేదు. కల్పన కోసం ఆమె స్నేహితులందరూ ఎదురు చూస్తున్నారు.

కల్పన ఎంతకీ కాలేజీకి రాకపోవడంతో ఆమె స్నేహితులు అందరూ రకరకాలుగా అనుకోసాగారు. కల్పన స్నేహితురాలు పద్మజ ఫోన్ చేసినా కల్పన ఆచూకీ తెలియకపోవడంతో స్నేహితులంతా ఎన్నో రకాలుగా ఊహించసాగారు.

ఇంతలో కాలేజీ అటెండర్ వడివడిగా కల్పన స్నేహితుల దగ్గరకు వచ్చాడు.

"అమ్మా! బీచ్ దగ్గర గుర్తుతెలియని అమ్మాయి శవం పడి వుందట. నా స్నేహితుడు ఇప్పుడే చెప్పాడు" ఆయాసపడుతూ చెప్పాడు అటెండర్.

"కల్పన ఆత్మహత్య చేసుకుందేమో" అంటూ అనుమానపడ్డారంతా. వారి మనసు పరిపరి విధాల పోయింది. మరికాసేపటికి కల్పన తన కెనటిక్ హోండాపై రానే వచ్చింది.

ఆమె స్నేహితులంతా సంతోషంగా ఊపిరి పీల్చుకున్నారు. పద్మజ రెండడుగులు ముందుకేసి కల్పనకు ఎదురు వెళ్లింది. "ఏమిటి? నిన్నంతా కాలేజీకి రాలేదు. మేము విన్నది నిజమేనా?" అడిగింది పద్మజ.

"నిజమే! హర్ష నన్ను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు" గంభీరంగా అంది కల్పన.

"అదేమిటి? రెండు సంవత్సరాలుగా నిన్ను ప్రేమిస్తూ పెళ్లి చేసుకుంటానని కూడా చెప్పి, ఇప్పుడిలా అనడానికి కారణమేమిటి?" అంది పద్మజ.

"హర్ష కూడా నాకు చెప్పలేదు. అసలు కారణం అతని స్నేహితుడు చెప్పాడు" అంది కల్పన.

"ఏమిటది?"

"ఇరవై లక్షలు కట్నం ఇస్తామంటూ ఒక మంచి సంబంధం వచ్చిందట. హర్ష తల్లిదండ్రులు అతన్ని ఒత్తిడి చెయ్యడంతో ఒప్పుకోక తప్పలేదట" అని చెప్పింది కల్పన.

"హర్ష ఇలా చెయ్యడం నాకేం నచ్చలేదు. నిన్నంతా నువ్వు కనబడకపోయేసరికి నువ్వు ఏ అఘాయిత్యం చేసుకున్నావోనని మేమంతా భయపడ్డాం" అంది పద్మజ.

"అఘాయిత్యం చేసుకోవడం సమస్యకి పరిష్కారం కాదు. పైగా నేనేమీ తప్పు చేయలేదు. హర్ష చేసిన తప్పును అతను తెలుసుకునేలా చేస్తాను. అతనిని తేలికగా వదిలిపెట్టను. నిన్నంతా నేను లాయర్ దగ్గరే వున్నాను. ఆధారాలతో సహా హర్ష చేసిన మోసాన్ని లాయర్ ముందుంచాను. అతనిపై చట్టపరమైన చర్య తీసుకుంటాను. ఆత్మహత్య చేసుకునేంత పిరికిదాన్ని కాదు నేను. ఆత్మహత్య చేసుకోవలసిన అవసరమూ లేదు. నా సమస్యను నేనే పరిష్కరించుకుంటాను" అంటూ కెనటిక్ హోండా స్టార్ట్ చేసి, ఇంటివైపు దారితీసింది కల్పన.

**-జి.మేరీకృపాబాయి**
(మచిలీపట్నం)